క్లుప్తంగా

ఉగాది పంచాంగ శ్రవణంపై సమావేశం



పంచాంగం చెప్పేందుకు రాసుకున్న పత్రాలను చూపుతున్న కార్పొరేటర్, ఎమ్మెల్యే సోదరుడు

పటాన్‌చెరు టౌన్: చైతన్య నగర్ కాలనీలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో ఉగాది పంచాంగ శ్రవణంపై ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పండితులు, పెద్దలతో కలిసి పంచాంగ శ్రవణంపై చర్చించారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ మాట్లాడుతూ...మార్చి 22న బుధవారం సాయంత్రం 5:30 గంటలకు వేద పండితుల చేత పంచాంగ శ్రవణం చెప్పబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజలు, పెద్దలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు.

అర్ధనారీశ్వరీ స్వరూపంలో అమ్మవారు



అర్ధనారీశ్వరీగా అమ్మవారు

సంగారెడ్డి టౌన్: ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామంలో సప్త ప్రాకారయుత శ్రీ దుర్గా భవానీ క్షేత్రంలో 22వ వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మాధికారి బ్రహ్మశ్రీ కమలంపేట రాధాకృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో రెండో రోజు పూజలు నిర్వహించారు. ఆదివారం అర్ధనారీశ్వరీ స్వరూపంలో దర్శనం ఇచ్చారు. వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో పూజలు నిర్వహించారు. సోమవారం లక్ష దీపోత్సవం ఉంటుందని, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

బసవ మండపంలో సామూహిక ప్రార్థనలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని దత్తగిరి కాలనీలో బసవ మండపంలో ఆదివారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. లింగాయత్ సమాజ్, బసవ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్వజారోహణంగావించి పాలరాతి బసవేశ్వరుడి విగ్రహానికి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

26వ వార్డులో మహిళా దినోత్సవం

సదాశివపేట(సంగారెడ్డి): 26వ వార్డులో మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగ నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ అపర్ణశివరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో మహిళలు కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. కౌన్సిలర్ అపర్ణశివరాజ్‌పాటిల్‌ను శాలువా కప్పి సన్మానించారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

మునిపల్లి(అందోల్): స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సౌత్ ఇండియా ఉపాధ్యక్షుడు రాహుల్ కిరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని బుదేరాలో టీ వరల్డ్ షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శైలజా శివశంకర్, జడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, నాయకులు శశికుమార్, అనంద్, మల్లేశం, మునిపల్లి సర్పంచ్ రమేష్, కార్తీక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురికి కోవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయిం. ఆదివారం ఐదుగురికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు.

కూచారంలో కొనసాగుతున్న స్వచ్ఛభారత్



చెత్తను తొలగిస్తున్న యువకులు

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్‌యూత్ వారం వారం స్వచ్ఛభారత్ చేపడుతున్నారు. ఆదివారం 256వ వారం స్వచ్ఛభారత్ చేపట్టి హరితహారంలో ప్లాస్టిక్, చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం మొక్కల పాదులను శుభ్రం చేసి నీటిని పోశారు. గ్రామ యువకులకు చిన్నారులు సైతం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ఆదివారం 1వ వార్డులోని గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ అమర్ సింగ్‌తో పాటు వైద్య సిబ్బంది, గ్రామస్తులతో పాటు పాల్గొని పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ లావణ్య, ఆశవర్కర్ ఇందిరా, శకుంతల, మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కబ్జా!

- బల్దియాలో లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలానికి ఎసరు
- పట్టించుకోని అధికారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి బల్దియాలో కబ్జాల పరంపర కొనసాగుతూనే ఉంది. రూ.లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలకు ఎసరుపెడుతున్నారు. సర్వే నెంబర్ 374లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి, బౌండ్రీలు వేస్తున్నా అధికారులు ఆవైపుగా కన్నెత్తి చూడడం లేదు. మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తూగుతున్నారు. అక్రమార్జన ధ్యేయంగా అధికారులు పనిచేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఏళ్లుగా పడి ఉన్న ఓపెన్ స్థలాలను ఇష్టారాజ్యంగా కబ్జాదారులు, రియల్టర్లు కబ్జాలకు పాల్పడుతున్నారు. సంగారెడ్డి బై పాస్ రోడ్డు సాయి బాబా గుడి కమాన్ వద్ద సర్వే నెంబర్ 374లో 100 గజాల ప్రభుత్వ స్థలం కబ్జాకి గురైందని సంబంధిత కాలనీ వాసులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్ శరత్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. సుమారు రూ. కోటి విలువ చేసే స్థలం కబ్జాకి గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతోనే ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



బైపాస్ రోడ్డులో కబ్జాకు గురైన స్థలం

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

అధికారులు ప్రజాప్రతినిధుల అండతోనే అక్రమార్కులు కబ్జాలు చేస్తున్నారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డు సాయి బాబా గుడి కమాన్ వద్ద గల సర్వే నెంబర్ 374లోని దాదాపు 100 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి.

–కుమార్, ప్రశాంత్ నగర్, సంగారెడ్డి

కలెక్టర్‌కు చెప్పినా ఫలితం లేదు

సంగారెడ్డిలో ఎన్ని కబ్జాలు చేసినా ఎవరికీ పట్టింపు లేదు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. టాస్క్ ఫోర్స్ పేరిట అక్రమ నిర్మాణాలు కూలుస్తున్నారు. వెంటనే తిరిగి కడుతున్నారు. ఇప్పటికై నా కబ్జాలు అరికట్టాలి.

– రాజు శాంతినగర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బృందావన్ టీచర్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బృందావన్ టీచర్స్ కాలనీలో అంతర్గత రహదారుల గుండా మురుగు నీటి కాలువ నిర్మించేందుకు అధికారులు నిర్ణయించగా, కాలనీ వాసులు ఇందుకు అభ్యంతరం తెలిపారు. కాలనీ వాసులతో సమావేశమైన ఎమ్మెల్యే ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జయలక్ష్మినగర్‌లో నిర్మిస్తున్న కట్ట మైసమ్మ దేవాలయం, రాఘవేంద్ర కాలనీ ఎల్లమ్మ దేవాలయాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహా గౌడ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



నారాయణఖేడ్: భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలోని చాప్టా(కె) గ్రామంలో రూ.10లక్షల ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. రహదారుల నిర్మాణానికి తగిన ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ సంగమ్మ సంగప్ప, రైబస అధ్యక్షుడు హన్మారెడ్డి, నాయకులు పార్శెట్టి సంగప్ప పాల్గొన్నారు. నిజాంపేట్ మండలం నాగ్ధర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు వెంకటేశం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నారంలో శ్రీ సత్యసాయి బాబా సేవ సమితి ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దైనందిన జీవితంలో కనీసం గంట సేపు వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పేదల కోసం ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, అన్నారం ఎయిర్‌ఫోర్స్ అకాడమి అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. ఆదివారం భారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో తెలంగాణ మహిళ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు అంజలి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న సింధు ఆదర్శ్ రెడ్డి

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

ఎన్ఎంఆర్ సేవా కార్యాలయం ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీలోని బాలాజీ నగర్ కాలనీలో ఎన్ఎంఆర్ సేవా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్కుల్ సర్పంచ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలే ఆయన్ను మూడోసారి సీఎంగా ప్రజలు గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్, లోకేష్‌బాబు, కృష్ణ, ఖదీర్, శ్రీను, ధనుంజయ, ప్రసాద్, రాజేష్ ఎన్ఎంఆర్ యువ సేన సభ్యులు పాల్గొన్నారు.



బొల్లారంలో ఎన్ఎంఆర్ సేవా సమితి కార్యాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నీలం మధు

క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారులతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాలకు ఎదుగుతారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్ చెరు మండలం క్యాసారం గ్రామ పరిధిలో ఎస్సీఆర్పీఎస్ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ టు ఆల్ కబడ్డీ టోర్నమెంట్‌కు నీలం మధు ముదిరాజ్ టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆర్థిక స్థోమత లేని గ్రామీణ క్రీడాకారులకు వెన్నుదన్నుగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటయ్య, ఉపసర్పంచ్ విక్రమ్ రెడ్డి, వార్డు సభ్యులు సుభాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు యాదయ్య, నర్సింలు, వెంకట్, నవీన్, వెంకట్, రాజు గౌడ్, ఖలీమ్, కమలాకర్, దినేష్, కార్తీక్, విజయ్, క్రీడాకారులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రుక్మిణీ పాండురంగ ఆలయ వార్షికోత్సవం

రాయికోద్(అందోల్): రాయికోడ్‌లోని రుక్మిణీ పాండురంగ ఆలయంలో ఆదివారం వార్షికోత్సవం నిర్వహించారు. ఆలయంలో పురోహితులు దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. అనంతరం భక్తులు నిండు కలశాలను ఎత్తుకొని, డప్పు చప్పుళ్ల మధ్య పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న భక్తులు విగ్రహ మూర్తులకు అభిషేకం చేశారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

మల్లన్న జాతరలో ఎమ్మెల్యే



జాతరలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కంచర్ల గూడెంలో ఆదివారం నిర్వహించిన శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కంచర్లగూడెంలో భారీ గజమాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు కోహీర్ సర్వసభ్య సమావేశం

కోహీర్(జహీరాబాద్): కోహీర్ మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షులు మాధవి అధ్యక్షతన సోమవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుజాత నాయక్ తెలిపారు. సమావేశానికి సంబంధించిన ఎజెండా ప్రతులను అధికారులు, ప్రజాప్రతినిధులకు అందచేశామన్నారు. ఎంపీపీ సమావేశమందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆమె సభ్యులను కోరారు.

శాంతినగర్‌లో నగర సంకీర్తన



నగర సంకీర్తనలో చిన్నారులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. తెల్లవారు జామునే శాంతినగర్ హనుమాన్ మందిరానికి చేరుకున్న భక్తులు భజనలు, కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి పురుషులు, మహిళలు, చిన్నారులు తరలివచ్చి భగవంతుడి నామస్మరణ చేశారు. ప్రజల్లో భక్తిబావం పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మునిపల్లి(అందోల్): మండలంలోని చిన్నచల్మెడ గ్రామంలో పాలరాతితో నిర్మిస్తున్న వీరాంజనేయస్వామి గుడికి కొందరు భక్తులు ఆదివారం విరాళం అందజేసినట్లు సర్పంచ్ విజయ్ భాస్కర్ తెలిపారు. గ్రామస్తుల సహకారంతో పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, దాతలు, అందజేసిన సహాయ సహకారాలతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యుత్‌నగర్‌కాలనీలో మూడు రోజుల క్రితం ఇంటర్మీడియట్ విద్యార్థి ముదాబ్బిర్ వీధి కుక్కల దాడిలో గాయపడిన విషయం అందరికీ తెలిసిందే. ఆ విద్యార్థికి మెరుగైన వైద్య సేవలకు మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి రూ.15వేలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ రూ.10వేలు ఆర్థిక సాయం ప్రకటించారు.

హామీలు అమలు చేయాలి

సీపీఐ పట్టణ కార్యదర్శి పి వినోద

సదాశివపేట(సంగారెడ్డి): ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పి. వినోద డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, ఉద్యోగ అవకాశాలు, మూడు ఎకరాల వ్యవసాయ భూమి, రెండు పడకల ఇళ్ల వంటి హామీల అమలుకు ప్రజలందరూ పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దత్తుస్వామి, శంకరప్ప, మహబుబ్‌అలీ యాకుబ్‌అలీ, పూలమ్మ, సంధ్యారాణి, లక్ష్మి, రజియాబేగం, సుల్తానా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు,



మాట్లాడుతున్న వినోద

వెయిట్ లిఫ్టింగ్ జిల్లా కార్యవర్గ ఎన్నిక

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పులిమామిడి రాజును ఆదివారం రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, రమేష్, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గొల్ల దశరత్, కోశాధికారిగా నాగేష్, జాయింట్ సెక్రెటరీలుగా అనిల్, చాపల వెంకన్న, నల్ల సాయికుమార్, కార్యవర్గ సభ్యులుగా సాయికిరణ్, సంగన్న, హరీష్ తదితరులను ఎన్నుకున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలు, ఎన్నికల అధికారులు దేవిక, శివకుమార్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ చౌరస్తాలో దెబ్బతిన్న రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. పస్తాపూర్ చౌరస్తాలో ఝరాసంగం వెళ్లేదారి మూల మలుపులో స్వాగత ద్వారం ముందు రోడ్డు దెబ్బతింది. పెద్ద పెద్ద గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతుంది. వర్షకాలంలో గుంతలో నీరు చేరడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకరావడంతో ఎట్టకేలకు సంబంధిత ఆర్ అండ్‌బీ అధికారులు ఆదివారం దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేశారు.

స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని సన్మానించిన దృశ్యం

నారాయణఖేడ్: ఖేడ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా సీహెచ్.సత్యంచారి, ఉపాధ్యక్షుడిగా గోసాయిపల్లి వెంకటేశం చారిలు ఎన్నికయ్యారు. ఆదివారం స్వర్ణకార సంఘం సభ్యులు కాశీనాథ్ ఆలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన వారిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. స్వర్ణకారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామని వారు హామీ ఇచ్చారు.

అట్టహాసంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): బొంతపల్లి గ్రామంలోని భద్రకాళీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్ల సన్నిధిలో ఆలయ ఈఓ శశిధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహకారంతో ఆలయం మరింత అభివద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నవీన, మమత, నాగేందర్‌గౌడ్, భద్రప్ప, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వేణు, రమేష్, దేవాలయ సిబ్బంది సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



బొంతపల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం